# గంధా కానూన్



కాలనీ మీటింగ్‌లు జరిగి చాలారోజులు గాప్ రావడంతో మాకందరికీ చాలా రిలీఫ్ దొరికినట్లయింది. గోపాల్రావ్ అయితే ఈ ప్రశాంతతకు నిజంగా ఆనంద పడిపోయాడు.

"ఆహా! మన చుట్టూ ఉన్న సమాజాన్ని పట్టించుకోకుండా, మన మీదకే సమస్య వచ్చినా 'ఏం చేస్తాం! తప్పదు' అనే ధోరణి అవలంబిస్తే జీవితం ఇంత ఆనందదాయకంగా వుంటుందా?" అనడిగాడు నన్ను.

"అవును! ఉంటుంది" అన్నాన్నేను.

"అయితే మనం ఇకనుంచి కాలనీ కమిటీని రద్దుచేసి పారేసి ఒకడి సంగతి ఒకడు పట్టించుకోకుండా– ఎవరిదారిన వాళ్ళు బ్రతికేయటం మందిచికదూ?" అడిగాడు రంగారెడ్డి.

"అవును. చాలా మంచిది" అన్నాన్నేను కాషన్‌గా.

ఎందుకంటే అదెలాగూ జరిగేదికాదు, పెట్టేదికాదు.

ఎవడికేం ఆపద వచ్చినా దూకుడుగా వాడికి సహాయం చేయడానికెళ్ళటం, సహాయం బదులు చివరకు హానిచేసి రావటం మన తెలుగువాళ్ళ స్పెషాలిటీ అన్న విషయం నాకు

తెలుసు.

ఏమయితేనేం కాలనీలో ఎలాంటి మీటింగ్‌లూ గొడవలూ లేకుండా ప్రశాంతంగా మరో వారం రోజులు గడిచింది. ఈ వారం రోజుల్లోనూ చాలా దిగులుగా, నిరుత్సాహంగా, ఏదో పోగొట్టుకున్నట్లు కాలనీ స్టేజ్ దగ్గర ఒక్కడే కూర్చుని మైక్ సెట్ రిపేర్ చేస్తున్నట్లు నటిస్తూ "హలో వన్ టూ– త్రీ– ఫోర్– ఫైవ్ – సిక్స్– సెవన్" అంటూ వందవరకూ అంకెలు ఇంగ్లీష్‌లో చదివి మైక్ టెస్టింగ్ అంటూ కనిపించిన ఒకే ఒక వ్యక్తి శాయిరామ్.

కానీ అలా ఎంతోకాలం జరగలేదు. మరో వారం రోజుల తర్వాత అకస్మాత్తుగా ఓ సంఘటన జరగడంతో అందరం అందులో ఇరుక్కోక తప్పలేదు. మా కాలనీ రైటర్ చంద్రకాంత్ ఛటోపాధ్యాయ స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్ వాళ్ళ ధర్మమా అని ఒక స్కూటర్ ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో కొనడానికి సన్నాహాలు ప్రారంభించాడు. ముందు కట్టాల్సిన నాలుగువేల రూపాయలు మేమంతా కలిసి పోగుచేసి అప్పుగా ఇచ్చాం అతనికి. అతను ఆ అప్పుని తను రాసే పుస్తకాలకు ముందుమాటలో మా అందరికీ కృతజ్ఞతలు చెప్పి తీర్చుకుంటానన్నాడు గానీ మేము వప్పుకోలేదు. ఎవరి డబ్బు వాళ్ళకి ఎప్పటికయినా కాష్ రూపంలోనే ఇవ్వాలని వార్నింగిచ్చాం. అయిష్టంగానే వప్పుకున్నా డతను. స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్ వాళ్ళు ఆ స్కూటర్ షోరూమ్ వారికి లెటర్స్ రాసి ఇచ్చారు. అందరం ఆ లెటర్ తీసుకుని షోరూమ్‌కి చేరుకున్నాం!

షోరూమ్ మేనేజర్ మా లెటర్ ఓసారి చదివాడు.

అతని మొఖంలో కనబడాల్సినంత ఆనందం కనిపించటం లేదు ఎందుకనో.

"ఏ కలరు స్కూటర్ కావాలి?" అనడిగాడు అనాసక్తిగా. మేమంతా ముందే ఏ కలర్ అడగాల్సిదీ చంద్రకాంత్‌కి నూరిపోశాం. అంచేత చంద్రకాంత్ తడుముకోకుండా 'మెరూన్' అని అరిచాడు.

అంతే! మేనేజరు ముఖ కవళికలు మారిపోయాయి.

"అందరూ మెరూన్, మెరూన్ అంటే ఎలాగయ్యా, ఇంకో కలరేదైనా తీస్కోండి" విసుగ్గా అన్నాడు.

"నాకు మెరూనే కావాలి!" మొండికేశాడు చంద్రకాంత్.

"మెరూన్ దొరకదు" అతనూ మొండికేశాడు.

"ఎందుకు దొరకదు?"

"అవి తక్కువ సప్లయ్ అవుతాయి కాబట్టి"

"ఎందుకు తక్కువ సప్లయ్ అవుతాయ్?" అతనికి చిర్రెత్తు కొచ్చింది.

"ఇదిగో చూడు మిష్టర్, ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో కొనేవాళ్ళు అట్లా అరవకూడదు. మీకా

కలర్ కావాలంటే ఇంకో నెల రోజులయాక రండి"

అందరం మొఖాలు చూసుకున్నాం.

"నెలరోజులా?"

"అవును!"

మా గొడవ చూసి యాదగిరి మధ్యలో కొచ్చాడు.

"ఏదొక్కలర్ తీస్కో రాదురా భయ్! ఒకటే లొల్లి పెడ్తున్ను. మెరూన్ అయితే మంచిగా నడస్తదా, వేరేది నడువదా?"

యాదగిరి డైలాగ్‌తో ఇక చేసేది లేక పరమ భయంకరంగా కనిపించే కలర్ స్కూటర్ సెలెక్ట్ చేసుకున్నాం. మామూలుగానే మొదటిరోజు అందరం చంద్రకాంత్ ఇంటిముందు గుమికూడాము ప్రారంభోత్సవానికి.

చంద్రకాంత్ భార్య వచ్చి కొబ్బరికాయ కొట్టి స్కూటర్‌కి దణ్ణం పెట్టింది.

"ఇలా పూజలు చేస్తే యాక్సిడెంట్స్ ఏమి అవకుండా ఉంటాయట" అందామె మిగతా ఆడాళ్ళతో.

"అవునవును" అన్నారు మిగతా ఆడవాళ్ళు.

"మరి రోడ్ నెంబర్- త్రీలో ఉన్న వరహాల్రావ్ ముహూర్తం పెట్టి పూజలు చేసి మొదటి రౌండ్‌లోనే రెండుకాళ్ళూ విరగ్గొట్టుకుని స్కూటర్‌ని పాత ఇనుప సామాన్ల దుకాణంలో అమ్మేశాడు కదా?" అడిగింది డిటెక్టివ్ రచయిత్రి రాజేశ్వరి.

అందరికీ రాజేశ్వరి మీద కోపం వచ్చింది. రాజేశ్వరికి మొదటి నుంచి కొంచెం కమ్యూనిస్ట్ భావాలు ఎక్కువ.

"శుభమా అని మనాడు స్కూటర్‌కి ప్రారంభోత్సవం చేస్తూంటే ఈవిడ యాక్సిడెంట్స్ గురించి మాట్లాడుతుందేమిటి?" విసుక్కున్నాడు రంగారెడ్డి.

పూజ కార్యక్రమం అయిపోయింది. అందరికీ తలో చిక్కీ పాకెట్ కానుకగా ఇచ్చాడు చంద్రకాంత్. తను ఇంకా పాపులర్ రచయిత అవలేదు కాబట్టి ప్రస్తుతానికి వాటితోనే సర్దుకోమని బ్రతిమాలాడు. పాపులర్ అయిన రచయిత అయిన మరుక్షణం అందరికీ హాట్ డ్రింక్స్ చికెన్ టిక్కా పబ్లిషర్స్ ఖర్చుమీద ఏర్పాటు చేయిస్తానని కూడా ప్రామిస్ చేశాడు. మేము సరేనని ఒప్పుకున్నాం.

ముందు వాళ్ళ పిల్లలను ఎక్కించుకుని స్కూటర్ స్టార్ట్ చేశాడు తను. ఫస్ట్ గేర్ వేయగానే మేమంతా తప్పట్లు కొట్టాము.

చంద్రకాంత్ కాలనీ చుట్టూ ఓ రౌండ్ దిగ్విజయంగా పూర్తి చేసుకుని వచ్చాడు. ఈ సారి వాళ్ళావిడని ఎక్కించుకుని కాలనీ చుట్టూ ఓ రౌండ్ కొట్టమని కోరారు ఆడాళ్ళందరూ.

"ఆ! ఇప్పుడెందుకు లెండి! తర్వాతెలాగూ వెళ్తాంగా" అంది వాళ్ళావిడ సిగ్గుపడిపోతూ.

"ఆహహ? అలా అంటే ఎలా! స్కూటర్ మీద కూర్చోవటం కూడా మీరు నేర్చుకోవాలి కదా!" అంటూ బలవంతం చేసి ఆమెను స్కూటర్ ఎక్కించారు.

మళ్ళీ చంద్రకాంత్ ఫస్ట్ గేర్ వేయగానే అందరం తప్పట్లు కొట్టాము.

స్కూటర్ రివ్వున దూసుకెళ్ళి మళ్ళీ ఇంకో పెద్ద రౌండ్ కొట్టి దిగ్విజయంగా తిరిగి వచ్చింది. చంద్రకాంత్ మొఖం గర్వంతో వెలిగిపోతోంది.

"డ్రైవింగ్ నేర్చుకొని చాలా దినాలైపోయింది గానీ ఆ టచ్ పోలేదు. చాలా ఈజీగా డ్రైవ్ చేసేయ గలుగుతన్నా" అన్నాడతను ఆనందంగా. అయితే అతని వెనుక సీట్ ఖాళీగా కనిపించేసరికి అతని భార్య మధ్యలో భయపడి దిగిపోయిందేమోనని అనుకున్నాం అందరం.

"మీ ఆవిడేదీ!" అడిగాడు రంగారెడ్డి.

చంద్రకాంత్ ఛటుక్కున వెనక్కు తిరిగి చూసి కెవ్వున కేకవేశాడు.

"అయ్యో! ఎక్కడో పడిపోయినట్లుంది" అన్నాడు పాలిపోయిన మొఖంతో మా అందరి గుండెలూ ఝుల్లుమన్నాయి.

అందరం స్కూటర్ వచ్చిన రూట్‌వేపు పరుగులు తీశాం.

మా కాలనీ బయట, కార్పొరేషన్ రోడ్ జాయిన్ అయే చోట కార్పొరేషన్ వాళ్ళు కొత్తగా తవ్విన గోతిలో పడిపోయి కనిపించిందామె. ఆదుర్దాగా ఆమెను లేపి కూర్చోబెట్టాం. కానీ ఆమె అప్పటికే స్పృహ తప్పింది. తలకూ కాళ్ళూ చేతులకూ దెబ్బలు తగిలాయి.

"ముందు డాక్టర్ దగ్గరకు తీసుకెళ్దాం పదండి!" అన్నాడు గోపాల్రావ్.

"ఆటోని పిలవండి" అరిచాడు రంగారెడ్డి.

యాదగిరీ, జనార్ధన్ ఆటో కోసం పరుగెత్తారు. రోడ్ పక్కనే అరడజను ఆటోలు ఖాళీగా కనిపించినయ్.

"ఆటో" పిలిచాడు యాదగిరి. ఒక ఆటోడ్రైవర్ సిగరెట్ కాల్చుకుంటూ వచ్చాడు నెమ్మదిగా.

"ఎక్కడకు పోవాలె?" అడిగాడతను.

"డాక్టర్ దగ్గరకు!"

"ఎవళ్ళను తీసుకుపోవాలె?"

"ఒకామెకు యాక్సిడెంట్ అయింది. అర్జంటుగా ఈ చుట్టుపక్కలున్న ఏదో ఒక డిస్పెన్సరీకి తీసుకుపోవాలి!"

"యాక్సిడెంటా? అయితే నేన్రాను" అనేసి వెళ్ళి ఆటోలో పడుకున్నాడు.

"ఎందుకు రావ్!" ఆశ్చర్యంగా అడిగాడు యాదగిరి.

"యాక్సిడెంట్ కేస్‌లంటే పోలీసులతో కిరికిరివయ్యా! నే(న్రాను"

"అరె! నువ్వేం పాగల్‌గానివా? నీయవ్వ- ఆడపేషెంట్ బేహూష్ ఉన్నదంటే ఫాల్తూ కిరికిరి చేస్తావ్"

ఆటో డ్రైవర్ మా మాటలు తనకుద్దేసించనట్లే "ఏక్ దో తీన్" అంటూ హిందీపాట పాడుకోసాగాడు.

"అరె! నీగ్గాదువయ్యా జెప్పేది?" మరింత కోపంగా అరిచాడు యాదగిరి.

ఆటోడ్రైవర్ అదే పాటను మరింత బిగ్గరగా పాడాడు.

"వీడితో ఏంట్లే- వేరే ఆటోలున్నయ్‌గా పద" అన్నాడు జనార్ధన్. ఇద్దరూ ఆ పక్కనే ఉన్న మిగతా ఆటోల దగ్గరకు నడిచారు.

మమ్మల్ని చేడగానే అందరూ అదే పాట పాడటం మొదలుపెట్టారు.

"ఆటో- ఇగో- జర అర్జెంట్! డాక్టర్ దగ్గరకు పోవాలె!నడు" అన్నాడు యాదగిరి.

"యాక్సిడెంట్స్ కేసులు తీసుకుపోము సార్!" ఒకతను పాట ఆపి చెప్పి మళ్ళీ పాటలో కెళ్ళిపోయాడు. యాదగిరికి కోపం ఆగలేదు.

"రాకుంటే ఆటో తీస్కోని ఇంటికి పో! రోడ్ మీదికెందుకు వచ్చినవ్?" అన్నాడు మండిపడుతూ.

"నువ్వెవడివి అడగటానికి?" తనూ లేచి నిలబడతూ అన్నాడు ఆటోవాడు.

నేనూ జనార్ధన్ యాదగిరిని వెనక్కు లాగాం.

"నేనెవడినా? నీయవ్వ- ఆటోకి లైసెన్స్ ఎందుకిచ్చిన్రు! పబ్లిక్ అడిగితే బరాబర్ పోవాలి! కానూన్‌ఎరుకనా నీకు?"

ఆ మాటతో ఆటోడ్రైవర్లందరూ పాట ఆపేసి ఘొల్లున నవ్వారు.

"వీడెవడో పిచ్చాడిలాగున్నాడు భాయ్! హైదరాబాద్‌లో ఆటోలకు కానూనంట"

వాళ్ళు పగలబడి నవ్వుతుంటే ఇంక అక్కడ టైమ్ వృధా చేయటం అనవసరమని ఆ ప్రక్కనే ఆగి ఉన్న రిక్షా దగ్గరకు నడిచాం.

అతను ఉలిక్కిపడి ఠక్కున లేచి నిలబడతాడని మేమనుకున్నాం. కానీ అలాంటిదేమీ జరగలేదు. అసలతను కళ్ళుకూడా విప్పలేదు.

"ఏం గావాలి?" అన్నాడు కళ్ళు మూసుకునే.

"ఒకామెకి ఆక్సిడెంట్ జరిగి బేహూశ్ అయింది. హాస్పిటల్ తీస్కపోవాలె!" చెప్పాడు యాదగిరి.

"ఏ దవాఖానాకి!

"ఏది దగ్గరుంటే అది"

"అట్లనా! ముప్పయ్ రూపాయిలిస్తావా?"

అందరం ఉలిక్కిపడ్డాం.

"ముప్పై రూపాయలా?"

"అవ్ సార్! యాక్సిడెంట్ కేస్ గదా?"

"అయితే?"

"పోలీసోండ్ల తోటి కిరికిరి. సార్! పరిషాన్జేస్తరు తర్వాత"

"ముప్పై రూపాయలిచ్చినా చేయక మానరు గదా?" అడిగాడు జనార్ధన్.

"ఇరవై రూపాయలిస్తాం. పద" అన్నాన్నేను.

యాదగిరి, జనార్ధన్ నావేపు కోపంగా చూశారు "రెండు మూడు రూపాయలిచ్చే దూరానికి ఇరవై ఇస్తానంటావేమి సంగతి?" అడిగాడు యాదగరి.

"అవతల ఆమె ప్రమాదంలో ఇరుక్కుని స్పృహ తప్పింది. ఈ సమయంలో బేరాలాడితే ఎలా?"

రిక్షావాడు చప్పున నా సపోర్ట్‌కొచ్చాడు.

"అవ్‌సార్! ఒక దినం గిట్లనే ఒక పెద్దమనిషి ఇరవై కొస్తవా, పాతిక్కొస్తావా అంటూ లొల్లి పెట్టుకున్నడు. చివరికేమాయె? ఇంటికిపోమే సరికే ఆమె చనిపోయె! నా పైసలు నాకియ్యబట్టె–"

ఆ మాటతో అందరి గుండెలూ ఝల్లుమన్నాయి. "నిజమే! చంద్రకాంత్ భార్య ప్రాణాలు కూడా పోతాయేమో" అన్నాన్నేను.

"సరే పద! ఆలస్యం చేయటం అనవసరం" అన్నాడు జనార్ధన్.

రిక్షా తీసుకుని కాలనీలో కెళ్ళాం.

అందరం కలసి ఆమెను రిక్షాలో కూర్చోబెట్టాం. తల నుంచి ఇంకా రక్తం కారుతూనే ఉంది. అందరం రిక్షా వెనుకే బయల్దేరాం. రాజేశ్వరి ఆమెను పట్టుకుని కూర్చుంది రిక్షాలో.

కొద్దిదూరం నడవగానే "డాక్టర్ ప్రయోగ్', ఎమ్,బి,బి,ఎస్ అన్న బోర్డు కనిపించింది.

"పదండి! ఈ డాక్టర్‌కి చూపిద్దాం" అన్నాడు రంగారెడ్డి.

శాయిరామ్ గేటు గీసుకుని లోపలికెళ్ళి డోర్ బెల్ మీట నొక్కాడు.

పరుగుతో వచ్చి కర్టెన్ పక్కక తొలగించి– "హెూ వెల్‌కమ్" అన్నాడో యువకుడు.

"మీ ఫాదర్‌ని పిలవండి! అర్జెంట్ కేస్ చూడాలి వెంటనే" అన్నాడు శాయిరామ్.

"మా ఫాదరెందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఎందుకేమిటి? పేషెంట్‌ని చూడాలి! సీరియస్ యాక్సిడెంట్ అయింది." ఆ మాటతో ఆ కుర్రాడు మొఖం పాలిపోయింది. కొంచెంగా కాళ్ళూ చేతులు వణకసాగినయి.

"నేనే డాక్టర్ని! మా ఫాదర్ కాదు! ఇంతకూ పేషెంట్ ఎక్కడ!"

"బయట రిక్షాలో ఉంది!"

అతను మాతోపాటు బయటికొచ్చాడు.

చంద్రకాంత్ భార్య అపస్మారక స్థితిలో ఉండటం చూసేసరికే అతనికి కళ్ళు తిరిగినట్లు అనిపించి కళ్ళు మూసుకున్నాడు.

"అదేమిటి సార్ పేషెంట్‌ని చూడండి" చెప్పాడు రంగారెడ్డి.

అతను అతికష్టం మీద కళ్ళు తెరచి స్టెతస్కోప్ మెడకు తగలించుకుని ఆమె దగ్గరకు వెళ్ళి స్టెతస్కోప్ మెడకింద పెట్టబోయాడు.

హఠాత్తుగా అతనికి మెడకింద గాయం నుంచి రక్తం కారటం కనిపించింది. అంతే! దభేల్‌మని కిందపడ్డాడు.

అతని నోటి నుంచి "రక్తం అమ్మో రక్తం రక్తం" అంటూ నాలుగయిదుసార్లు వినిపించాక అతని మాట పడిపోయింది. ఆ తరువాత చూపులు కూడా తేలేశాడు. లోపల్నుంచి వాళ్ళమ్మ కాబోలు పరుగుతో శోకాలూ పెడుతూ వచ్చింది.

"ఓర్నాయనో! బంగారం లాంటి నా కొడుకుని చంపేశారు దేవుడో ఇంత లేత కుర్రాడికి ఎవరయినా రక్తం చూపిస్తారా? అసలు వీడికి డాక్టర్ కోర్స్ చెప్పించొద్దండీ వాడు తట్టుకోలేడు అంటే వినకుండ డాక్టర్ కోర్సులో చేర్పించిన వీడి తండ్రినినాలి"

"మేమేం చేయలేదమ్మా! మా పేషెంట్‌ని చూపించడానికి తీసుకొచ్చాం!"

"మీరింక పొండిరా నాయనా! మావాడికి మొదటి పేషెంట్‌నే ఇలాంటి రక్తం కనిపించేట్లు తీసుకొస్తారా? మీకేమయినా బుద్ధుందీ? జ్ఞానం ఉందీ!" అంటూ పరుగుతో లోపలికెళ్ళి మరో డాక్టర్‌కి ఫోన్ చేయసాగింది.

ఇంక లాభం లేదని మేము పేషెంట్‌తో పాటు ఇంకో డాక్టర్ కోసం బయల్దేరాము.

రిక్షావాడు మావైపు ఆనందంగా చూశాడు.

"ఇంకో డాక్టర్ దగ్గరకా సార్?"

"అవును!"

"ఏం ఫర్లేద్సార్! తోలుకేల్తా! ఇంకో పదహార్రూపాయలివ్వండి సార్ చాలు!"

యాదగిరికి కోపం ఆగలేదు.

"ఏయ్! ఆమె చావు బ్రతుకుల మధ్యనుంటే మధ్యల పైసలకిరికిరేంబే! నకరాల్జేస్తున్నావ్?" అన్నాడు వాడిమీదకెళుతూ.

"ఇగో– గిట్ల రువాబ్ చేసిన్రంటే మంచి గుండద్సార్! నేను వాపస్ బోతా!" అన్నాడు వాడు రిక్షా వెనక్కు తిప్పుతూ.

అందరం అమాంతం వాడి దగ్గరకు వెళ్ళి గడ్డం పట్టుకుని బ్రతిమాలాం.

"ఇదిగో...చూడవోయ్ రిక్షా! మా వాడేదో తొందరపడి..."

"నా పేరు రిక్షా కాదు" కోపంగా అన్నాడు.

మేము నాలిక్కరుచుకున్నాం.

"అబ్బే– నీ పేరు రిక్షా అని కాదు. పేరు తెలీక..."

"తెల్వకపోతే అడగాల్సార్! నేనేం ఆల్తూ ఫాల్తూగాడ్ననుకుంటున్రా ఏం? ఈ రిక్షా నా సొంతం! ఎరికనా!"

నేను రంగారెడ్డికి కన్ను కొట్టాను. ఇలాంటి సందర్భాల్లో రంగారెడ్డి చాలా అద్భుతంగా పరిస్థితిని అదుపులోకి తీసుకొస్తాడన్న విషయం నాకు తెలుసు.

"ఇగో చూడండి రిక్షా ఓనరుగారూ! డబ్బు సంగతి తర్వాత ఆలోచిద్దాం. ముందు ఆమె ప్రాణాలు కాపాడాలి కదా మనం! అంచేత త్వరగా తీసెకెళ్తే....."

"ఇగో– గిది– గిట్ల ఇజ్జత్‌తోటి మాట్లాడాలె! ఆయనేమి సార్– గట్ల వరుల్తాడు?"

రిక్షా మళ్ళీ బయల్దేరింది.

ఫర్లాంగ్ దూరంలోనే నర్సింగ్‌హోమ్ కనిపించేసరికి మాకు ప్రాణం వచ్చినట్లయింది. అందరం లోపలకు పరుగెత్తుకెళ్ళి స్ట్రెచర్ తీసుకుని ఆమెను లోపలకు చేర్చాం. అప్పటికప్పుడే నలుగురు నర్సులు చుట్టుముట్టారు.

"ఏమయింది?" ఒకామె మావంక చూస్తూ అడిగింది.

"ముందు డాక్టర్‌ని పిలవండి! అర్జెంట్! ఆమె అన్‌కాంషస్ అయ్యింది" చెప్పాడు రంగారెడ్డి.

వాళ్ళు మొఖాలు చూసుకున్నారు.

"ఎలా అయ్యింది?" ఒకామె అడిగింది.

రంగారెడ్డి పళ్ళు కొరుక్కుని బయటకుమాత్రం చిరునవ్వునవ్వుతూ మాట్లాడాడు.

"అదంతా డాక్టర్‌కి చెపుతాంలేమ్మా! ముందు డాక్టర్‌ని పిల్చుకురండి!"

ఆమె తాబేలులా నడుస్తూ లోపలకెళుతుంటే మాకు వళ్ళు మండిపోయింది.

"నీయవ్వ– ప్రాణాలంటే జర్రగూడ ఖదర్‌లేదు" అన్నాడు యాదగిరి కోపం అణచుకుంటూ.

మా పక్కనే నిలబడ్డ మరో నర్స్ కోపంగా చూసింది మా యాదగిరివేపు.

"అవ్! ఒక్కసారి సర్కార్ దవఖానాకు వెళితే తెలుస్తది. ఎవళ్ళకు ఖదరుంటదో" అందామె.

మేము సైలెంట్ అయిపోయాం.

ఎందుకంటే నిజంగానే మాకు గవర్నమెంట్ హాస్పిటల్ గుర్తుకొచ్చింది.

మరో అయిదునిమిషాల తర్వాత డాక్టర్ మరో తాబేలు బండిమీద వచ్చినట్లు

వచ్చింది. వస్తూనే మా మొఖాలవేపు పేషెంట్ ముఖంవేపు చూసింది.

"వాట్ హేపెన్డ్?" అంది మళయాళీ ఇంగ్లీషులో.

"ఆమెకు దెబ్బలు తగిలాయండీ" చెప్పాడు రంగారెడ్డి.

"ఓవ్" అందామె పేషెంటువేపు అనుమానంగా చూస్తూ.

"ఈజిట్ లారీ యాక్జిడెంట్ ఓర్ స్కూటర్ యోగ్జిడెంట్?" అడిగింది నావైపు చూసి. నాకామె మాటలేమాత్రం అర్థం కాలేదు గానీ రంగారెడ్డి ఠక్కున అర్థం చేసుకున్నాడు.

"లారీ యాక్జిడెంట్ కాదు డాక్టర్! స్కూటర్ యాక్జిడెంట్" అన్నాడు తనూ మళయాళ ఇంగ్లీషులోకి దిగిపోతూ.

"ఓవ్!" అందామె ఇంకో అడుగు వెనక్కు వేస్తూ.

"తలక్కూడా పెద్ద దెబ్బలేమీ తగలలేదుకానీ ఎందుకో స్పృహ తప్పిందండి" చెప్పాడు చంద్రకాంత్.

"హు ఓజ్ డ్రైవింగ్ ద స్గోటర్?" తిరిగి అడిగిందామె మా అందరివంక హంతకులను చూసినట్లు చూస్తూ.

"డిస్ బోయ్! దిస్ బోయ్" అన్నాడు రంగారెడ్డి చంద్రకాంత్ వైపు చూపుతూ.

"ఓవ్! దిస్ బోయ్? ఆమెకు ఇతను ఏమి రిలేషన్ ఉంది?"

"ఆమె నా భార్యేనండి" చెప్పాడు చంద్రకాంత్.

"ఓవ్!" అందామె ఇంకో అడుగు వెనక్కు వేస్తూ.

ఈలోగా ఓనర్స్ బాండేజీలు, కాటన్ అన్నీ ఓట్రేలో తీసుకొచ్చిందక్కడికి.

"బాండేజ్ వెయ్యమంటారా డాక్టర్!" అడిగిందామె.

"ఓవ్! నోనోనో! డోంట్ టచ్ హర్" అంది భయంగా మావేపు చూస్తూ.

మేము అదిరిపడ్డాం.

"వాట్ హేపెన్డ్ డాక్టర్?" అడిగాడు రంగారెడ్డి ఆతృతగా.

"డేంజర్!" అందామె రహస్యంగా "అది మెడిగో లీగల్‌కేస్."

మాకు ఆమె మాటలు ఏమాత్రం అర్థం కాలేదు.

ఆ మాట వింటూనే నర్సులు కూడా ఓ అడుగు వెనక్కేసారు.

"ఏమిటంటున్నారు?" అయోమయంగా అడిగాడు రంగారెడ్డి.

"ఇది మెడికో లీగల్ కేస్ అంటోందామె" అన్నాడు గోపాలరావు.

"అంటే ఏమిటి?"

"అంటే ఇది పోలీస్ కేస్ అన్నమాట."

మాకు మరీ అగమ్యగోచరంగా ఉందీ గొడవ.

"ఇంతకూ ఇప్పుడు మీరేమంటారు డాక్టర్?" అడిగాడు జనార్ధన్ మా వెనుకనుంచీ

మమ్మల్నందరినీ పక్కకుతోసి సినిమా హీరోలా ముందుకొస్తూ.

"యూ హావ్ టు టేక్ హర్ టు గవర్నమెంట్ హాస్పిటల్"

అందరం ఉలిక్కిపడ్డాం.

చంద్రకాంత్ ముఖం పాలిపోయింది.

"గవర్నమెంట్ హాస్పిటల్కా?" వణుకుతున్న గొంతుతో అడిగాడతను.

"ఎస్!"

"అక్కడికి ఎందుకు వెళ్ళటం? మీరు ఎందుకు ట్రీట్ చెయ్యరు?"

"బికాజ్ ఇటీజ్ మెడిగో లీగల్ కేస్"

"మెడికో లీగల్ కేస్ అయితే మాత్రం? ప్రాణాపాయంలో ఉన్న పేషెంట్‌ను ట్రీట్ చేయనంటారేమిటి?" ఎదురు తిరిగాడు గోపాలరావు.

"ఓవ్! వుయ్ డోంట్ డూ ఇట్" నిర్లక్ష్యంగా అందామె.

"ఎందుకు చేయరని అడుగుతున్నా! ఒక డాక్టరుగా ఏ పేషెంట్‌నయినా వెంటనే ట్రీట్ చేయాల్సిన ఆబ్లిగేషన్ మీకుంది."

"అఫ్‌కోర్స్! ఆ ఓబ్లిగేషన్ ఓన్‌లీ జనరల్ కేసెస్‌కి! నాట్ ఫర్ మెడిగో లీగల్ కేస్"

"దిసీజ్ టూ మచ్" అన్నాడు రంగారెడ్డి.

"యుకెన్ గో" అందామె లోపలి కెళ్ళిపోతూ.

యాదగిరికి మండిపోయినట్లుంది. పరుగుతో వెళ్ళి ఆమెకు అడ్డం నిలబడ్డాడు.

"ఇగో డాక్టరమ్మా మంచిగ చెపుతున్నా! ముందామెకి వైద్యం గిట్ల జేస్తవా చెయ్యవా?" రెండుచేతులూ హీరోలా నడుము మీద పెట్టి దౌర్జన్యంగా అడిగాడు.

"నో! మెడిగో లీగల్ కేసులు గవర్నమెంట్ హాస్పిటల్‌కే తీసుకుపోవాలి!" తనూ మొండిగా అంది డాక్టరు.

గోపాలరావ్ కల్పించుకున్నాడు మధ్యలో.

"ఇదిగో మనం ఇప్పుడు వాదనలు పెట్టుకుని లాభం లేదు కానీ ఇంకో నర్సింగ్‌హోమ్ కోటీలో వుంది పదండి అక్కడికి పోదాం" అన్నాడతను.

ఆ మాట నిజమేననిపించింది మాకు.

ఆ గొడవల్లో తల దూర్చడం కంటే ముందు ఆమెకు వైద్యం జరగటం ముఖ్యం.

వెంటనే అందరం ఆమెను తీసుకుని మళ్ళీ రిక్షాలో వేసుకుని కోటీ వైపు బయలుదేరాం.

ఆ నర్సింగ్ హోమ్ చాలా బిజీగా వుంది.

పావుగంట వెయిట్ చేశాక ఓ డాక్టరు బయటికొచ్చాడు.

"ఏమయింది?" అడిగాడు పేషెంట్‌ని పరీక్షిస్తూ.

"నా స్కూటరు మీద నుంచి స్లిప్ అయి పడిపోయిందండీ!"

"స్కూటరు యాక్సిడెంటా?" పరీక్షించడం ఆపేసి అడిగాడు.

"అవును సార్! చాలా మైనరు యాక్సిడెంట్" తేలిగ్గా అన్నాడు రంగారెడ్డి.

"అయితే ఇది మెడికో లీగల్ కేస్"

మేము ఏమీ తెలీనట్లు ఆ పదాలు అంతకు ముందెప్పుడూ విననట్లు నటించాం.

"అంటే ఏమిటి డాక్టర్?"

"అంటే పోలీస్ కేసు అన్నమాట! ఇలాంటివన్నీ గవర్నమెంట్ హాస్పిటల్స్ కెళ్ళాలి!"

"అంటే పేషెంట్ ప్రాణం పోతున్నా గానీ మీరు చూడరా" కోపం అణుచుకుంటూ అడిగాడు జనార్ధన్.

"ఎలా చూస్తాం! మెడికో లీగల్ కేస్ కదా ఇది!"

యాదగిరికి చటుక్కున ఓ అయిడియా వచ్చింది.

"అవ్‌సార్! మెడికో లీగల్ కేసేగానీ, జర ఇప్పటికయితే ట్రీట్‌మెంటు ఇయ్యండి! ఇంకొకసారి గిట్లా యాక్సిడెంట్ అయితే గవర్నమెంట్ హాస్పిటల్ కెళతాం"

"కుదరదండీ! త్వరగా తీసుకెళ్ళండి. ఆలస్యం చేయకూడ దిలాంటివి"

"పోనీ మీరు ఫస్టు ఎయిడ్ లాంటిరి చేయండి! ఆ తర్వాత గవర్నమెంట్ హాస్పిటల్ కెళ్తాం"

డాక్టరు చిరాకుపడ్డాడు.

"అరె! మేము చేయగూడదంటే వినరేమయ్యా! ఇదంతా మాకు లేనిపోని కిరికిరి అవుతుంది."

"బాబ్బాబు అలా అనకండి! ఆమె ఇంకెవరయినా అయితే గవర్నమెంటు హాస్పిటల్‌కే తీసుకెళ్లేవాళ్ళమే గానీ ఆమె మావాడి భార్యండి! పైగా వాడికి ఆమె అంటే చాలా ప్రేమ! అందుకని దయచేసి మీరే ట్రీట్‌మెంట్ ఇస్తే"

డాక్టర్‌కి కోపం వచ్చేసింది.

"ఇక్కడ ట్రీట్‌మెంట్ ఇవ్వరని చెప్పాను కదా! గవర్నమెంట్ హాస్పిటల్ కెళ్ళండి" అనేసి లోపలికి వెళ్ళిపోయాడు.

"ఛలో భాయ్– గవర్నమెంట్ దవాఖానాకే పోదాం పదండ్రి! ఈ హౌలా గాళ్ళందర్నీ బ్రతిమిలాడేదేందీ?" అన్నాడు యాదగిరి డాక్టర్ వెళ్ళినవేపే చూసి గట్టిగా అరుస్తూ.

అందరం ఆమెను తీసుకుని గవర్నమెంట్ హాస్పిటల్ చేరుకున్నాం. అరగంట నిలబడ్డాక కేస్‌షీటు రాసిచ్చాడు క్లర్క్. అది తీసుకుని డాక్టరు దగ్గర కెళ్ళేసరికి ఇంకో అరగంట పట్టింది.

"ఈమెకెట్లా తగిలాయి దెబ్బలు" అడిగాడు డాక్టర్.

"స్కూటర్ మీద నుంచి కింద పడిపోయిందండి?"

"ఓ! మెడికో లీగల్‌కేసా?"

"అవునండీ!" భయంగా జవాబిచ్చాం! గవర్నమెంట్ హాస్పిటల్లో కూడా మెడికో లీగల్ కేసులు చూడరేమో అన్న అనుమానం పట్టుకుందందరికీ!

"చాలా సీరియస్ కేస్ కదా" అన్నాడు ఆలోచనలో పడుతూ.

"అవునండీ! అందుకే ముందు ట్రీట్‌మెంట్ స్టార్ట్ చేస్తే బాగుంటుందని" వినయంగా చెప్పాడు రంగారెడ్డి.

"ఆ! అవును– అన్‌కాంషస్ అన్నారు కదా! ఓకే ఓకే" అంటూ ఎడ్మిట్ అని రాశాడు కేస్‌షీట్ మీద. మామూలుగానే స్ట్రెచర్ మీద తీసుకెళ్ళే బాయ్‌కీ, వార్డుబాయ్స్‌కీ, గేటు దగ్గర వాచ్‌మెన్‌కీ అందరికీ ఎవరి ఫీజు వాళ్ళకు కట్టాక వార్డ్‌లోకి అనుమతించారు వాళ్ళు.

గంటసేపటి తర్వాత ఓ డాక్టర్ వచ్చి ఆమెను చూసి కేస్‌పేపర్ మీద ఏమేమో రాసి వెళ్ళిపోయాడు.

నర్స్ ఇంజెక్షన్ తెచ్చి మా చేతికిచ్చింది.

"ఇందులో రాసి వున్న ఇంజెక్షన్లు కొనుక్కురండి!" అంది చాలా మామూలుగా.

"మేము కొనుక్కురావటం ఎందుకు? మీ హాస్పిటల్లో వుండవా" కోపంగా అడిగాడు శాయిరామ్.

"వుంటాయ్ గాని మా గాంధీ హాస్పిటల్ మందుల గురించి మొన్ననే పేపర్లో న్యూస్ వచ్చింది చదివారా"

"ఓ! చదివాను" ఉత్సాహంగా చెప్పాడు యాదగిరి. "అవన్నీ డూప్లికేట్ మందులని పేపర్లో రాసిన్రులే!" అన్నాడు మాతో.

"ఇలాంటి పరిస్థితుల్లో మా ఇంజెక్షన్‌లు వాడితే ఇంకేమయినా వుందా? కావాలంటే అదే చేసేస్తాను! నాదేం పోయింది!"

అందరం వద్దని ఆవిడని బ్రతిమాలి ఇంజెక్షన్ కొనుక్కొచ్చాం.

ఆ ఇంజెక్షన్ ఇచ్చిన తర్వాత కాసేపటికే ఆమె స్పృహలో కొచ్చింది.

వస్తూనే ఓసారి చుట్టూ చూసి, తర్వాత మా అందరి ముఖాలూ చూసి నవ్వింది.

"ఏమిటి? ఈ కాస్త దెబ్బలకే నన్ను హాస్పిటల్లో చేర్చేశారా?" అంది ఆశ్చర్యపోతూ.

"ప్రైవేట్ నర్సింగ్‌హోమ్‌లో రెండుమూడు గంటలుంచితే ఇంటికి తీసుకెళ్ళి పోవచ్చనుకున్నాం. కానీ వాళ్ళేమో వైద్యం మేము చేయం అంటే మేము చేయం అని బయటకు గెంటేస్తున్నారు. గత్యంతరం లేక గవర్నమెంట్ హాస్పిటల్‌కి తీసుకురావల్సి వచ్చింది" చెప్పాడు చంద్రకాంత్.

ఆ మాట వినడంతోనే ఆమె కెవ్వున కేకవేసి లేచి బెడ్‌మీద నుంచి కిందకు దూకేసింది.

"బాబోయ్... ఇది గవర్నమెంట్ హాస్పిటలా? అమ్మో- నేనిక్కడుండను? పదండి వెళ్ళిపోదాం" అంది భయంతో వణికిపోతూ.

మేముంతా ఆమెను బలవంతంగా బెడ్‌మీద కూర్చోబెట్టాం మళ్ళీ.

"ఏం ఫర్లేదు చెల్లమ్మా! మేమంతా ఉన్నాం కాదా! రెండురోజులు ఎలాగోలా కళ్ళు మూసుకుంటే చాలు. ఇంటికెళ్ళిపోవచ్చు" సర్ది చెప్పాడు రంగారెడ్డి.

ఆమె భోరున ఏడ్చేయటం ప్రారంభించింది.

"నేను మీకేం ద్రోహం చేశానని నన్నిలా గవర్నమెంట్ హాస్పిటల్లో చేర్పించారండి... నేను కాపురానికొచ్చిన దగ్గర్నుంచీ నాకోసం ఒక్క చీరైనా కొనిపెట్టమని పేచీపెట్టలేదే! ఆ పాడు నవల అచ్చువాలంటే ఆ ఎడిటర్‌కి ముందు కొట్టించాలని డబ్బంతా నాశనం చేస్తూన్నా పల్లెత్తుమాట అనలేదే? రచయితల కాన్ఫరెన్స్‌లని బెంగుళూరు, వైజాగు వెళ్ళివస్తుంటే నేనూ వస్తానని నోరువిప్పి అడగలేదే. ఆ అడ్డమయిన రేషన్‌షాపు క్యూల్లోనూ, కిర్సరాయిలు క్యూల్లోనూ, మంచినీళ్ళ క్యూల్లోనూ గంటల తరబడి నిలబడ్డానుగాని మీ గవర్నమెంట్‌ని వొక్కసారయినా తిట్టలేదే! ఎందుకండీ! ఎందుకిలా అన్యాయం చేశారు నన్ను!"

ఆమె ఏడుపుకి ఇద్దరు నర్సులు, ఓ అరడజను మంది పేషెంట్లు వచ్చిమూగారు మా చుట్టూ.

"ఏమయింది? ఎడ్మిట్ అయి గంటేగా అయ్యింది! అప్పుడే చంపేశారా?" ఆశ్చర్యంగా అడగిందో పేషెంట్.

ఆమె పక్కనున్న పేషెంట్ ఆమెను కసురుకున్నాడు.

"ఏమిటా తెలివితక్కువ వాగుడు? ఎడ్మిట్ అయిన గంటకే ఎలా చంపుతారు? డాక్టర్లు వచ్చి చూడ్డానికే వారం రోజులు పడుతుంది. ఆ తరువాత వారం రోజులుగ్గాని ట్రీట్‌మెంట్ కోసం ఏర్పాట్లు ప్రారంభించరు. ట్రీట్‌మెంట్ మెదలుపెట్టాక కదా ఆమె చనిపోయేది?"

ఆమె భయంగా తలూపింది.

"అందరూ తప్పుకోండి" బొంగురుగొంతు కేక వినపడి మేము ఉలిక్కిపడి పక్కకు జరిగాము.

ఓ లావుపాటి పోలీస్ కానిస్టేబుల్ మమ్మల్ని ఇంకొంచెం పక్కకు నెట్టి బెడ్ దగ్గరకొచ్చి చంద్రకాంత్ భార్య వైపు చూశాడు. వెంటనే ఓ పుస్తకం పెన్నూ తీసుకున్నాడు.

"నీ పేరేంది" అడిగాడామెని.

"శశిరేఖ!"

"నీ భర్త పేరేంది?"

"చంద్రకాంత్"

"ఏడుంటారు మీరు?"

"నిర్భయ్‌నగర్ కాలనీ!"

అతను ఓ క్షణం ఆలోచించాడు.

"నిర్భయ్ నగర్ కాలనీయా? గంటే మీ కాలనీకి పోలీస్‌స్టేషన్ కావాలని అర్జీలు పెట్టి తీరా పెట్టినంక పోలీస్‌స్టేషన్ తీసేయాల్నని కిరికిరి చేసింది మీ కాలనీవోళ్ళేకదూ?"

"అవును"

అతను మళ్ళీ రాసుకోబోయి ఆమె వైపు చూశాడు.

"నీకు సదవను రాయను వచ్చా!"

"వచ్చు"

"అయితే నువ్వే రాసివ్వు?" అంటూ ఆ పుస్తకంలో కాగితం ఆమెకి ఇచ్చాడతను. శశిరేఖతో పాటు, మేమరందరం కూడా ఆశ్చర్యపోయాం.

"ఏం రాసివ్వాలి?" అడిగాడు చంద్రకాంత్ అతనిని.

అతను చంద్రకాంత్ వేపు చిరాకుగా చూశాడు.

"నువ్వెవళు?"

"నా పేరు చంద్రకాంత్!"

"నేను పేషెంట్ తోటి మాట్లాడుతుంటే మధ్యలో నువ్వెందుకు మాట్లాడతావ్?"

"ఆమె నాభార్య"

హఠాత్తుగా కానిస్టేబుల్ మొఖంలోకి కళ వచ్చేసింది.

"గట్లనా? నువ్వేనా ఈమెను స్కూటర్ మీదకెళ్ళి కిందకు నూకింది?"

చంద్రకాంత్ గాబరాపడ్డాడు ఆ ప్రశ్నకు.

"స్కూటర్ మీద నుంచి స్లిప్ అయి పడిపోయింది"

"గప్పుడు స్కూటర్ ఎవరు డ్రైవ్ చేస్తుండె?"

"నేనే"

"నీకు లైసెన్స్ గిట్ట వుందా?"

"వుంది!"

"ఉన్నదా అంటే ఉంది అని సమాధానం ఇయ్యకు– తీసి చూపించాలె!"

చంద్రకాంత్ తన పర్స్‌లో నుంచి డ్రయివింగ్ లైసెన్స్ తీసి అతని కిచ్చాడు.

అంతా ఓసారి చెక్ చేసి అది తిరిగి ఇచ్చేశాడతను.

"నీలాంటోళ్ళకు డ్రైవింగు లైసెన్స్ గిట్ట ఇచ్చినందుకు ఆర్డీవోని లోపట జేయాలి!"

అంటూ శశిరేఖ వేపు చూశాడు మళ్ళీ.

"అగో-గట్ల కూసున్నావు? రాయమని జెప్పలే?"

"ఏమి రాయాలి?" అడిగిందామె.

"గవర్నమెంట్ దవాఖానా కొచ్చినోండ్లు ఇంకేం రాస్తరమ్మా! ఇంత కూడా ఎరుకలేదా? డయ్యింగ్ డిక్లరేషన్ రాయలె! సమాజైనాది?"

"ఏమిటి? డయ్యింగ్ డిక్లరేషనా?" ఆశ్చర్యంగా అడిగాడు రంగారెడ్డి.

కానిస్టేబుల్‌కి ఒళ్ళు మండిపోయింది. రంగారెడ్డి వేపు కోపంగా తిరిగాడు.

"నువ్వెవళ్ళు?"

"రంగారెడ్డి!"

"రంగారెడ్డంటే ఎవళ్ళు? హజార్ రంగారెడ్లున్నారు శహర్‌ల!"

"ఈయన మా కాలనీ కమిటీ సెక్రటీవయా! జర మంచిగ మాట్లాడు" ఎదురుతిరిగాడు యాదగిరి.

"ఏయ్? నువ్వెవళ్ళు?" కాగితం తీసి రాసుకోడానికి సిద్ధపడ్డాడు కానిస్టేబుల్.

"నా పేరు యాదగిరి"

"నీయబ్బ పేర్జెప్పు!"

"ఎందుకు జెప్పాలె? నేనేం దొంగతనం జేసినానా, మర్డన్లు జేసినానా-"

"గట్లనా? గిప్పుడే ఎరుకవుతాది బిడ్డా! గిప్పుడే ఎరుకవుతాది" అంటూ మళ్ళీ శశిరేఖ వేపు తిరిగాడు.

"ఏమాయెనమ్మ! రాసినావా? డైయింగ్ డిక్లరేషన్ అంటే తెలీదా? సచ్చేముందు సావు ఎట్ల మీదికొచ్చిందో రాసెడిదన్నమాట"

"అంటే నేను చచ్చిపోతానా? గాబరాగా అడిగిందామె.

"పాగల్ మనిషిలాగున్నావేమమ్మా! సర్కార్ దవాఖానా కొచ్చినోండ్లు తిరిగి ఇండ్లకు బోతారు?"

"ఇదిగో కానిస్టేబుల్ గారూ! కొంచెం మర్యాదగా మాట్లాడండి! ఆమెకు ఏం పెద్ద దెబ్బ తగిలిందని - డైయింగ్ డిక్లరేషన్ ఇమ్మంటున్నారు? ఇంకోసారలా అడిగారంటే నేనూరుకోను- ఆ?" కోపంగా అన్నాడు చంద్రకాంత్.

కానిస్టేబుల్ మా అందరివేపూ మండిపడుతూ చూశాడు.

"ఇగో- ఈ ఫాల్తూ కిరికిరంతా నాకెందుగ్గాని- నువ్వెట్ల పడినావో, ఎవళ్ళు పడేసిన్రో కాయితం మీద రాసివ్వు! తర్వాత నువ్వు సచ్చినా బతికినా గాని మాక్కిరిక్కిరుండది!"

ఆమె నాలుగులైన్లు రాసి సంతకం చేసి ఇచ్చింది.

వేరే ఇంకో కాగితం మీద కూడా ఆమె సంతకం తీసుకుని వెళ్ళిపోయాడతను.

మర్నాటి సాయంత్రం వరకూ ట్రీట్‌మెంటేమీ ప్రారంభించక పోయేసరికి డిశ్చార్జ్ అడిగి తీసుకుని ఇంటికి చేరుకున్నాం.

హాస్పిటల్లో తలకువేసిన బాండేజ్ మార్పించడానికి మర్నాడు ఇంకో డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళాం అందరం కలసి.

గోపాల్రావుకీ ఆ డాక్టర్‌కీ స్నేహం ఉండటం వల్ల అతను ట్రీట్‌మెంట్ ఇవ్వడానికి అంగీకరించాడు.

"అయితే మీరంతా ఓ ప్రామిస్ చేయాలి" అడిగాడు మా అందరి ముఖాలవైపు చూస్తూ.

"ఏమిటిది?" అడిగాడు గోపాల్రావు.

"ఇది స్కూటర్ యాక్సిడెంట్ కాదు అని చెప్పాలందరూ! ఏదీ ఓ రిహార్సల్ వేయండి"

నేను అయోమయంగా శాయిరామ్ వైపూ రంగారెడ్డి వైపూ చూశాను.

"రిహార్సలేమిటి సార్! మాకు వివరంగా చెపితే"

"అదేనండీ! అందరూ గట్టిగా చెప్పండోసారి! ఇది స్కూటర్ యాక్సిడెంట్ కాదు"

అందరం గట్టిగా చెప్పాం. "ఇది స్కూటర్ యాక్సిడెంట్ కాదు"

"ఆమెను రోడ్ మీద ఒక వీధి ఆవు పొడవటం వల్ల దెబ్బలు తగిలినవి!"

"ఆమెను రోడ్డు మీద ఒక వీధి ఆవు పొడవటం వల్ల దెబ్బలు తగిలినవి!" అందరం చెప్పాం.

"వెరీగుడ్! మిమ్మల్ని పోలీసులొచ్చి అడిగినప్పుడు ఇదే చెప్పాలి వారికి. అర్థమయిందా?"

"అయింది డాక్టర్!"

అతను శశిరేఖకు వైద్యం చేశాక ఇంటికి చేరుకున్నాం.

ఆ సాయంత్రం అందరం కాలనీ వేదిక దగ్గర కూర్చుని ఆ యాక్సిడెంట్ గురించి మాట్లడుకుంటుంటే పోలీస్‌వాన్ ఒకటి వచ్చి మా ఎదురుగ్గా ఆగింది.

అందులో నుంచి బిలబిలముంటూ పోలీసులు దిగి మా దగ్గరకొచ్చి తుపాకులు తీసుకుని మాకు గురిపెట్టారు. ఇన్‌స్పెక్టర్ పిస్టల్ తీసుకుని మా దగ్గరకొచ్చాడు. ఎందుకైనా మంచిదని అందరం చేతులెత్తేశాం.

"ఇక్కడ చంద్రకాంత్ ఎవరు?" అడిగాడతను.

"నేను" అన్నాడు చంద్రకాంత్ తెల్లబోతూ.

"వాన్ ఎక్కు! యూ ఆర్ అండర్ అరెస్ట్."

"ఎందుకూ?"

"నీ భార్యను స్కూటర్ మీద నుండి పడేసినందుకు?"

"పడేయమేంటండీ? అది యాక్సిడెంట్ కదా?"

"ఏదైనా అవనీ. ముందు స్టేషన్‌కు పద."

చంద్రకాంత్‌కు భయం వేసినట్లుంది. మావైపు చూశాడు సపోర్టు కోసం.

"ఏమిటండీ? ఏం జరిగిందసలు? వాటీజ్‌ది ప్రాబ్లమ్" అడిగాడు రంగారెడ్డి కల్పించుకుంటూ.

"వీడ్ని కూడా లోపల వేసేయండి" కానిస్టేబుల్స్‌తో చెప్పాడుతను.

కానిస్టేబుల్స్ అతన్నీ, చంద్రకాంత్‌నీ లాఠీలతో తోసుకుంటూ వాన్‌లో ఎక్కిం చేశారు.

"సంగతేమిటి చెప్పమంటే మరీ ఇంత దౌర్జన్యమా? ఎవరు కల్పించుకుంటే వాళ్ళను వాన్ ఎక్కిచేస్తుంటే చూస్తూ ఊరుకుంటామనుకున్నారా?" కోపంగా అదిచాడు గోపాల్రావ్.

"వాడిని కూడా వేసెయ్యండి"

గోపాల్రావ్‌ని కానిస్టేబుల్స్ ఈడ్వబోతుంటే తన ప్రెస్ ఎక్రిడిషన్ కార్డ్ చూపించాడు.

దాంతో షాక్ కొట్టినట్లు అతనిని వదిలేశారు పోలీసులు.

"జర్నలిస్ట్ అని చెప్పరేం?" అని గొణుక్కుంటూ వాన్ ఎక్కేశారు. వాన్ స్టార్టయింది. మేమంతా అరుస్తూ వెనుక పరుగెత్తాం కానీ లాభం లేకపోయింది.

"సంగతేమిటో కనుక్కుందాం పదండి" అన్నాడు గోపాల్రావ్.

వెంటనే శాయిరామ్ విజృంభించి కాలనీ వాళ్ళందరినీ పది నిముషాల్లో పోగు చేసుకొచ్చాడు.

అందరం పోలీస్‌స్టేషన్ చేరుకున్నాం.

బయటే కానిస్టేబుల్స్ మాకు తుపాకులు గురిపెట్టారు.

"ఎవడైనా లోపలికోచ్చాడో జాగ్రత్త! కాల్చిపారేస్తాం" అరిచాడు ఒక కానిస్టేబుల్.

"మేము యుద్ధం చెయ్యడానికి కాదయ్యా వచ్చింది. మావాడిని ఎందుకరెస్ట్ చేశారో మీ ఇన్‌స్పెక్టర్‌ని కనుక్కోడానికొచ్చాము" చెప్పాడు గోపాల్రావ్.

"అయితే ఎవరైనా ఒకరిద్దరు లోపలకు రండి. మిగతా వాళ్ళంతా అక్కడే దూరంగా నిలబడాలి."

నేనూ, గోపాల్రావ్, చంద్రకాంత్ భార్య శశిరేఖ, యాదగిరి లోపకు నడిచాం.

ఇన్‌స్పెక్టర్ మావంక కోపంగా చూశాడు.

"ఏమిటి, అందరినీ వెనవేసుకుని వచ్చి దాడి చేద్దామనుకుంటున్నారా?" అడిగాడతను.

"అది కాదండి. మా వాళ్ళను అరెస్ట్ చేసి తీసుకొచ్చారు. కారణం ఏమిటో తెలుసుకుందామని" చెప్పాడు గోపాల్రవ్.

"కారణం ఏమిటేమిటయ్యా! మీకు తెలీదా కారణం?"

"తెలీద్సార్!"

"స్కూటర్ యాక్సిడెంట్ చేసి వాళ్ళావిడను కింద పడేశాడు. అర్థమైందా."

"అయింది గాని అది కేవలం యాక్సిడెంట్ అని తెలిసినా అతన్నెదుకు అరెస్ట్ చేసినట్లు?"

"యాక్సిడెంట్ అని ఎవరంటారు?"

"మేమందరం అంటాం" కోపంగా అన్నాడు యాదగిరి.

"నేనట్లా అనను."

"మీరేమంటారు?"

"కావాలనే యాక్సిడెంట్ చేశాడంటాను"

మేము ఆశ్చర్యపోయాం.

"కావాలనే యాక్సిడెంట్ చేయటమా?" ఆశ్చర్యంగా అడిగాను నేను.

"అవను" ఖండితంగా అన్నడు ఇన్స్పెక్టర్.

"హౌ రిడిక్యులస్?" అన్నాడు గోపాల్రావ్ నావేపు తిరిగి.

"చాలా రిడిక్యులస్?" అన్నాడు యాదగిరి.

"యూ కెన్ గో నౌ" అన్నాడు ఇన్స్పెక్టర్ మండిపడుతూ.

"చూడండి ఇన్స్పెక్టర్ గారూ! కావాలని సొంత భార్యను ఎవడైనా యాక్సిడెంట్ చేసి కిందపడేస్తాడా" అడిగాడు గోపాల్రావ్. అందరం నవ్వాం.

"తప్పకుండా పడేస్తాడు" అన్నాడు ఇన్స్పెక్టర్.

"ఎందుకు పడేస్తాడండీ? అలా లాజిక్ లేకుండా మాట్లాడతారేం?" నేనడిగాను ఉ క్రోషంగా.

"లాజిక్ ఎందుకు లేదు? చాలా వుంది."

"ఏమిటది?'

"వరకట్నాల విషయంలో ఆమెను వేధించి వుంటాడు. అందుకని ఆమెను చంపేయటానికి ఈ కొత్త పద్ధతి ప్రయోగించాడని మా అనుమానం."

ఆ మాట వింటూనే శశిరేఖ ఫక్కున నవ్వింది.

"ఏమిటి? ఆయన వరకట్నం ఆడగటమా? ఏడ్చినట్లుంది. నన్ను కావాలని ఒక్క పైసా కట్నం అడగకుండా మ్యారేజ్ చేసుకున్నా రాయన. అక్కడితో ఆగక మా నాన్నగారు పోయేసరికి తనే మా చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు చేసి మా తమ్ముళ్ళకు చదువు కూడా చెప్పించారు. ఆయనకున్న పొలం కాస్త అమ్మేసి మా వాళ్ళ కోసమే ఖర్చు చేశారు" అందామె ఏకధాటిగా.

ఇన్స్పెక్టర్ ముఖం మాడిపోయింది.

"ఇప్పుడేమంటారు? ఇప్పటికైనా మా వాళ్ళను వదిలేస్తారా?" అడిగాడు గోపాల్రావ్.

ఇన్‌స్పెక్టర్ ఓ క్షణం ఆలోచించాడు.

"మాకు మీ వేషాలన్నీ తెలుసు. మీ కాలనీ వాళ్ళందరూ కలిసి ఆమెతో అలా అబద్దాలు చెప్పిస్తున్నారు. నిజానికి తన భర్త ఎంత దుర్మార్గుడైందీ ఆమెకు బాగా తెలుసు. మీరందరూ ఇంక ఇక్కడి నుండి వెళ్ళకపోతే మా సాక్ష్యాలను బెదిరింపుల ద్వారా లొంగదీసుకుంటున్నారన్న ఆరోపణ మీద అరెస్టు చేయాల్సి వస్తుంద" అన్నాడు కసిగా.

మాకు మతిపోయినట్లయింది.

"ఆల్‌రైట్? నేనిప్పుడే బెయిల్ ఎరేంజ్ చేస్తాను" అన్నాడు గోపాల్రావ్.

ఇన్‌స్పెక్టర్ హేళనగా నవ్వాడు.

"డౌరీ హరాస్‌మెంట్ కేసులకు బెయిల్ ఇవ్వరు. అదీగాక యిది ఎటెంప్ట్ టు మర్డర్ కేస్ కిందకూడా బుక్ చేస్తున్నాం. ఈ రెండూ గాక రాష్ అండ్ నెగ్లిజెంట్ డ్రైవింగ్ కిందకూడా రిజిష్టర్ చేసుకున్నాం. మీ తాతలు దిగి రావాలి మీ వాడిని విడిపించుకోవాలంటే."

మాకేం చేయడానికీ తోచలేదు.

శశిరేఖ ఏడుపు ప్రారంభించింది.

"అయ్యో! మా ఆయన్ను వీళ్ళు చంపేస్తారేమోనండీ! ఏం చేయాలండీ" అంటూ ఏడవడం మొదలుపెట్టేసరికి ఇన్‌స్పెక్టర్ కానిస్టేబుల్స్‌ని పిలిచాడు.

"వీళ్ళందరినీ బయటకు గెంటేయండి!"

కానిస్టేబుల్స్ లాఠీలతో మా అందరినీ బయటకు తోసేశారు.

వళ్ళు మండిపోయి అందరం బయట నినాదాలు ప్రారంభించాం.

"పోలీస్ జులుమ్ డౌన్ డౌన్"

"దొంగ కేసులు డౌన్ డౌన్"

"పోలీస్ గూండాయిజం డౌన్ డౌన్"

ఇలా ఓ పావుగంట చేశాక నలుగురు కానిస్టేబుల్స్ వచ్చి గాలిలోకి తుపాకులు పేల్చారు. మన పోలీసులు గాలిలోకి తుపాకులు పేలిస్తే జరిగిందేమిటో మనందరికీ తెలుసు. నేలమీద వున్న వారికే బుల్లెట్స్ తగుల్తాయ్.

అంచేత అందరం పరుగెత్తుకుంటూ కాలనీ కొచ్చిపడ్డాం.

అప్పటికప్పుడు ఈ పరిస్థితిని చర్చించడానికి శాయిరామ్ మీటింగ్ పెట్టాడు.

"వెంటనే హోమ్ మినిస్టర్ దగ్గరకు ఊరేగింపు జరుపుదాం" అన్నాడు గోపాల్రావ్.

"హోమ్ మినిస్టర్లు ఇలాంటివి పట్టించుకోరు. పోలీస్ కమిషనర్ దగ్గర కెళ్ళటం మంచిది" అన్నాడు జనార్ధన్.

"లేకుంటే డిజిపిని కల్సుకుందాం" అన్నాడు యాదగిరి.

కొంతమంది మాత్రం బయల్దేరి ఆటోల్లో డిజిపిగారి దగ్గరికెళ్ళాం. అప్పుడే నగ్జలైట్స్ ఏదో ఊళ్ళో ఓ పోలీస్‌ని అరెస్ట్ చేసినట్లు వార్త అందటం చేత డిజిపిగారు హడావుడిగా ఆఫీస్ వదలి హోమ్‌మినిస్టర్ దగ్గరకు వెళ్ళిపోయారు. పోలీస్ కమీషనర్ ఎన్టీఆర్‌తో పాటు విశ్వామిత్ర షూటింగ్ ఏర్పాట్లు చూడ్డానికి వెళ్ళారని తెలిసి తిరిగి కాలనీకి చేరుకున్నాం.

అందరం దిగాలుపడి కూర్చున్నాం.

చంద్రకాంత్ భార్య అందరి మధ్య కూర్చుని వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"ఊరుకోమ్మా ఇంకేం చేస్తాం! పిల్లల్ని పెట్టుకుని ఇక ముందు జీవితం ఎలా గడపాలో చూసుకో. లాకప్‌లోకి పోయినోడు కాటికి పోయినోడూ యింక తిరిగిరారు" అంటోంది, ఓ ముసలమ్మ.

హఠాత్తుగా మా వాళ్ళలో సంచలనం కనిపించింది.

"పోలీస్ వస్తున్నాడు" అన్నారెవరో.

అందరం లేచి నిలబడ్డాం భయంగా.

పోలీస్ కానిస్టేబుల్ తిన్నగా మా దగ్గరకొచ్చాడు.

"ఏమిటి సంగతి" అడిగాడు శాయిరామ్.

"మీ కాలనీ ప్రెసెడెంటెవళ్ళు?" అడిగాడతను.

"నేను" అన్నాడు గోపాల్రావ్.

"మీతో జర మాట్లాడాలి!"

నేను, గోపాల్రావ్, యాదగిరి కానిస్టేబుల్‌తో పాటు స్టేజి వెనక్కి నడిచాం.

"సంగతేమంటే మా ఇన్‌స్పెక్టర్ సాబ్ లేడా? షానా దిల్దార్ మడిసి భాయ్. మా పోలీస్ కానూన్ దిక్కుకెళ్ళి మీ కాలనీ ఓళ్ళందరూ గిట్ల పరిషానవుతున్రని, నన్ను పంపించిండన్నట్లు!"

"అలాగా! ఏమంటాడాయన?" అడిగాడు శాయిరామ్ ఆశగా. "మావాళ్ళను వదిలేస్తాడా?"

"అవ్! ఆ విషయం గురించే మాట్లానికి మీ దగ్గరకొచ్చినా. చెప్పినగదా మా ఇన్‌స్పెక్టర్ సాబ్ బలే దిల్దార్ మనిషి!"

"చాలా సంతోషం" అన్నాడు గోపాల్రావ్. "ఎపుడు వదులుతున్నారు వాళ్ళను?"

"గిప్పుడంటే గిప్పుడే."

యాదగిరి ఆనందానికి హద్దులేదు.

"నేన్జెప్పలేదువయ్యా! పోలీసోండ్లలో గూడా మహానుభావులుంటరు" అన్నాడతను.

"ఇంకా ఆలస్యం ఏమిటి మరి? స్టేషన్ కెళ్దామా?" అడిగాడు శాయిరామ్.

"పైసల్దీసుకు రాండ్రి! వెళ్దాం" నెమ్మదిగా అన్నాడు కానిస్టేబుల్.

అందరం ఉలిక్కిపడ్డాం.

"పైసలా? ఏం పైసలు?" ఆశ్చర్యంగా అడిగాడు యాదగిరి.

"అదే భాయ్, జెప్పిన గదా! ఇన్‌స్పెక్టర్ సాబ్ దిల్దార్ మనిషి. ఇదే ఇంకోళ్ళుంటే నాలుగువేలు కమాయిస్తుండె గానీ మా ఇన్‌స్పెక్టర్ సాబ్ పైసల మనిషి కాదు. ఇజ్జత్ తోటి నౌఖరీ చేయాల్నంటాడు."

మాకు అప్పటికి అర్థమైంది.

"ఎంత ఇవ్వాలి?" అడిగాడు శాయిరామ్ పాలిపోయిన ముఖంతో

"చాలా తక్కువ భయ్యా ఒక్క వెయ్యి రూపాయల్జాలు! అది గూడా మన కాలనీ వాండ్లని కన్సెషన్ ఇచ్చిండన్నట్లు, లేకుంటే మీకు ఎరుకలేందేమున్నది? ఒక్కసారి ఎఫ్ఐర్‌ల గిట్ట రాసిన్రంటే జాలు! పదివేలు పడాల్సిందే! జెప్పినా కదా! మా ఇన్‌స్పెక్టర్ సాబ్ దిల్దార్ మనిషి!"

"ఒక్క నిమిషం. ఇప్పుడే వస్తాం" అన్నాడు శాయిరామ్.

"ఏం పర్లేదు- పది నిముషాలు టైమ్ తీస్కోండ్రి! జెప్పినా గదా! మా ఇన్‌స్పెక్టర్ సాబ్ దిల్దార్ మనిషి!"

అందరం డిస్కస్ చేసుకుని, పాముల్తోనయినా చెలగాటాలాడొచ్చు గానీ పోలీసుల తో వేళాకోళాలాడగూడదని నిర్ణయించుకుని అప్పటికప్పుడే అందరం కలసి వెయ్యి రూపాయలు పోగుచేసి కానిస్టేబుల్ కిచ్చాము.

కానిస్టేబుల్ ప్రేమగా మా భుజం మీద చేతులేశాడు.

"ప్రజలు, పోలీసులు కలిసి గిట్ల పన్జేయాలే! ఇగో- ఒక్క విషయం జెప్తున్నా- ఇను-మన దోస్తాన మంచిగున్నది. నువ్‌గానీ మీ కాలనీలనో ఇంకెళ్ళయినా గానీ మర్డర్లు, కిడ్నాప్‌లు, భార్యలను కిర్సనాయిలు పోసి కాల్చుడులు- ఏమైనా జేయండి! మీ మీద ఈగవాలకుండ నేన్జూసుకుట! ఏమంటున్నా! జరన్ని పైసలు ఖర్చు జేయాల! గంతనే-'

మేమేమీ మీట్లాడలేదు. వెంటనే రంగారెడ్డి, చంద్రకాంత్‌లు కాలనీ కొచ్చేశారు.

ఆ తరువాత గంటలోపలే చంద్రకాంత్‌తో పాటు అందరం ఆటో బ్రోకర్స్ దగ్గరకెళ్ళి అతని స్కూటర్ అమ్మి పారేసి హాపీగా ఇంటికి చేరుకున్నాం.